


SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




## విజయవాడ నగర వీధుల్లో ఎన్డీఏ అగ్ర నేతల విహారం



* ప్రధాని శ్రీ మోదీతో కలిసి శ్రీ పవన్ కళ్యాణ్, శ్రీ చంద్రబాబు రోడ్ షో
* బ్రహ్మరథం పట్టిన బెజవాడ జనం
* శ్రీ మోదీ చిత్రపటాలతో మహిళల పాదయాత్ర
* బందరు రోడ్డుని ముంచెత్తిన మూడు పార్టీల జెండాలు, అభిమానులు
* కూటమి షో సూపర్ సక్సెస్ తో మూడు పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం

శతఘ్ని న్యూస్: కనకదుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రి సాక్షిగా బెజవాడ పురవీధుల్లో ఎన్డీఏ కూటమి పక్షాల వికసిత నినాదాలు మిన్నంటాయి. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీతో కలిసి భాగస్వామ్య పక్షాల అగ్రనేతలు శ్రీ పవన్ కళ్యాణ్ గారు, శ్రీ చంద్రబాబు నాయుడు గారు నిర్వహించిన భారీ రోడ్ షో జయహో మోదీ జీ.. జయజయహో పవన్, జయహో చంద్రబాబు నినాదాలతో మారుమోగింది. బందరు రోడ్డులో ఎన్డీఏ అగ్రనేతలు ప్రచార రథంపై విహరించగా దేశ ప్రధానితో పాటు జనసేన, టీడీపీ అధినేతలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బుధవారం సాయంత్రం ఈ మెగా ఈవెంట్ కి రాజధాని నగరం విజయవాడ వేదిక అయ్యింది. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పక్షాలతో కలిసి సభలు నిర్వహించిన ప్రధాన మంత్రి శ్రీ మోదీ గారు, తుది అంకంలో రాజధాని నగరంలో రోడ్ షోతో ప్రచారాన్ని ముగించారు. మూడు పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. బుధవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు, జనసేన అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు, టీడీపీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేరుకున్నారు. ప్రజల జయజయధ్వానాల మధ్య ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రచార రథం ఎక్కి రోడ్ షో లో పాల్గొన్నారు. ప్రధానితో పాటు అగ్రనేతల రాక నేపథ్యంలో ఎం.జి.రోడ్డుకి ఇరు వైపులా బారికేడ్లతో మూడంచెల రక్షణ వలయం ఏర్పాటు చేసి రోడ్ షో తిలకించేందుకు వీలుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే ఈ మెగా రోడ్ షోని తిలకించేందుకు ఉమ్మడి కృష్ణా జిల్లాతోపాటు చుట్టు పక్కల జిల్లాల నుంచి మూడు పార్టీల శ్రేణులతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. గ్యాలరీల్లో కిక్కిరిసిన జనాలు శ్రీ మోదీ గారికి, శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, శ్రీ చంద్రబాబు నాయుడు గారికి మద్దతుగా నినాదాలు చేస్తుండగా ముగ్గురు నేతలు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మున్సిపల్ స్టేడియం, లబ్బీపేట, పీవీపీ, డీవీ మేనర్ హోటళ్ల మీదుగా సుమారు రెండు కిలోమీటర్లు గంటకు పైగా ఈ రోడ్ షో సాగింది. ప్రచార రథానికి ముందు మహిళలు శ్రీ మోదీ గారి చిత్రపటాలతో పాదయాత్రగా కదలగా, తరలివచ్చిన ఆశేష జనవాహినికి అభివాదం చేస్తూ మూడు పార్టీల అగ్రనేతలు ముందుకు కదిలారు. వికసిత్ భారత్ టార్గెట్ 2047, శ్రీ మోదీ జీకి విజయం కలగాలి అంటూ ప్రజలు ప్లకార్డులు ప్రదర్శించారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారికి, శ్రీ చంద్రబాబు నాయుడు గారికి మద్దతుగా ప్రజలు స్వచ్ఛందంగా బ్యానర్లు ప్రదర్శిస్తూ సందడి చేశారు. నగరంలోని గుజరాతీ ఆడపడుచులు గ్యాలరీల్లో సంప్రదాయ నృత్యాలతో ప్రధానికి, టీడీపీ, జనసేన అధినేతలకు స్వాగతం పలికారు. ఎన్డీఏ అగ్రనేతల రోడ్ షోలో బందరు రోడ్డు మొత్తం మూడు పార్టీల జెండాలతో నిండిపోయింది. రోడ్ షో సాగినంతసేపు ప్రధాని చేతులు ఊపుతూ ప్రజలకు అభివాదం చేస్తూ కనిపించారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు, శ్రీ చంద్రబాబు గారు మద్దతుగా తరలివచ్చిన జనవాహినికి నమస్కరిస్తూ ముందుకు సాగారు. ముగ్గురు నేతలపై ప్రజలు పూల వర్షం కురిపించగా భద్రతా కారణాల దృష్ట్యా ఎస్పీజీ నాయకులకు రక్షణ వలయంలా నిలిచారు. అమరావతి రైతులు కూటమి నేతల రోడ్ షోకి సంఘీభావంగా తరలివచ్చారు. రాత్రి 8 గంటలకు బెంజి సర్కిల్ వద్ద ముగిసిన ఈ రోడ్ షో కూటమి శ్రేణుల్లో జోష్ నింపింది.

## జగన్ కక్షపూరిత రాజకీయాలతో రాష్ట్ర అభివృద్ధి తిరోగమనం

* వైసీపీ సర్కారు రైతులకు మేలు చేయలేదు
* నిరుద్యోగుల్ని పట్టించుకోరు... వ్యాపారాలు చేసుకోనివ్వరు..
* వైసీపీ దాష్టికాలు ఆగాలంటే శ్రీ మోదీ ప్రధాని కావాలి... రాష్ట్రంలో కూటమి రావాలి
* పీలేరు ఎన్డీఏ ఎన్నికల ప్రచార సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నాగబాబు

శతఘ్ని న్యూస్: 'వైసీపీ పాలకులు రైతులకు మేలు చేయరు. నిరుద్యోగులను పట్టించుకోరు. వ్యాపారస్తులను వ్యాపారాలు చేసుకోనివ్వరు. ఈ అరాచక పాలనకు ముగింపు పలకాల'ని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ నాగబాబు గారు స్పష్టం చేశారు. వైసీపీ దాష్టికాలు ఆగాలన్నా, రైతులు, యువత, మహిళలకు భరోసా లభించాలన్నా దేశంలో శ్రీ మోదీ గారు మరోసారి ప్రధాని కావాలని, రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావాలని అన్నారు. పరిపాలనా దక్షతలేని కక్షపూరిత రాజకీయాలు చేసే ముఖ్యమంత్రి వల్లే రాష్ట్రం ఐదేళ్లుగా తిరోగమనం బాట పట్టిందన్నారు. 25 ఏళ్లు వెనక్కి వెళ్లిపోయిందని తెలిపారు. బుధవారం పీలేరులో జరిగిన ఎన్డీఏ కూటమి బహిరంగ సభలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ నారా లోకేష్ గారితో కలిసి పాల్గొన్నారు. సభకు హాజరైన ఆశేష జనవాహినిని ఉద్దేశించి శ్రీ నాగబాబు గారు ప్రసంగిస్తూ "ఇది రాయలవారు ఏలిన రాయలసీమ. భారత దేశ పురోభివృద్ధికి అనుక్షణం పరితపిస్తున్న గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి ఈ గడ్డ నుంచి స్వాగతం పలుకుతున్నాం. శ్రీ మోదీజీ గ్యారెంటీ, శ్రీ చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం, శ్రీ పవన్ కళ్యాణ్ గారి విశ్వాసం రాష్ట్రానికి ఎంతో అవసరం అని చెప్పిన ప్రధాని మాటలు ఐదు కోట్ల మంది ప్రజలకు భరోసా కల్పించాయి. శ్రీ మోదీ గారి నాయకత్వంలో దేశం వెలిగిపోతోంది. అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. మన రాష్ట్రం మాత్రం ఐదేళ్లుగా తిరుగోమనంలో ఉంది. 25 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయింది. వైసీపీ ప్రభుత్వం పరమ పవిత్రమైన తిరుమల క్షేత్ర పవిత్రతను దెబ్బ తీసింది. శ్రీవాణి దర్శనాల పేరిట స్వామి దర్శనాన్ని వ్యాపారం చేసి సామాన్య భక్తులను ఇబ్బంది పెడుతోంది. శ్రీ మోదీ గారు అయోధ్యలో బాల రాముడి విగ్రహం ప్రతిష్ఠాపన చేస్తే, మన రాష్ట్రంలో రాముడి తల నరికేశారు. గల్ఫ్ దేశాల్లో స్వామి నారాయణ మందిరాన్ని నిర్మించి మన ధర్మాన్ని శ్రీ మోదీ గారు విస్తరింప చేస్తుంటే, వైసీపీ ప్రభుత్వంలో దేవతా మూర్తుల విగ్రహాల చేతులు నరికేసి, రథాలు తగులబెడుతున్నారు. హిందూ మతాన్ని అవమాన పరుస్తున్నారు.

* ఎర్రచందనం స్మగ్లర్లకు వైసీపీ టిక్కెట్లు

శేషాచలం అడవుల్లో దొరికే అరుదైన ఎర్రచందనాన్ని వైసీపీ నాయకులు విదేశాలకు స్మగ్లింగ్ చేస్తున్నారు. ఐదేళ్ల కాలంలో రూ. 3 వేల కోట్ల విలువైన ఎర్రచందనం దేశం దాటి పోయింది. ఎర్రచందనం స్మగ్లింగ్ లో ఆరితేరిన వ్యక్తికి వైసీపీ టిక్కెట్ కూడా లభించింది. ఏ పని కావాలన్నా రాష్ట్రంలో జె ట్యాక్స్ మాదిరి ఈ ప్రాంతంలో పి ట్యాక్స్ కట్టాలి. ఆఖరుకి మూతపడిన మైనింగ్ యూనిట్స్ నుంచి కూడా నెలకు రూ. 2 లక్షలు వసూలు చేస్తున్నారు.

* రాయలసీమ రైతులకు కూటమి అండ

రాయలసీమ ప్రాంతం ఉద్యాన పంటలకు, మదనపల్లి టమాటా మార్కెట్ ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పంటల ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి. శ్రీ మోదీ గారు, కూటమి ప్రభుత్వం రాయలసీమ రైతాంగానికి అండగా నిలుస్తారని వారి తరఫున హామీ ఇస్తున్నాను. శ్రీ మోదీ గారి దూరదృష్టి, శ్రీ చంద్రబాబు నాయుడు గారి అనుభవం, శ్రీ పవన్ కళ్యాణ్ గారి చిత్తశుద్ధి రాష్ట్రానికి మేలు చేస్తాయి. తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో అన్యమతస్తుల ప్రమేయం లేకుండా చేయాలని ఈ సందర్భంగా కోరుతున్నాను" అన్నారు.



SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




# శాసనసభలో మహిళల్ని అగౌరవపరిచిన వైసీపీని ఇంటికి పంపిద్దాం



* వైసీపీ ప్రలోభాలకు లొంగితే భవిష్యత్తు నాశనం
* కూటమి ప్రభుత్వంలో జోడెద్దుల్లా అభివృద్ధి, సంక్షేమం
* సంపద సృష్టించి సంక్షేమాన్ని అందిస్తాం
* యువతకు ఉద్యోగాలు ఇవ్వడం మద్యం, గంజాయి అమ్ముకునే వాళ్ల వల్ల కాదు
* కూటమి ప్రభుత్వం రాగానే ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి నోటిఫికేషన్ ఇస్తాం
* కూటమి అభ్యర్థులను గెలిపించండి
* గన్నవరం వారాహి విజయభేరి బహిరంగ సభలో శ్రీ పవన్ కళ్యాణ్

శతఘ్ని న్యూస్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపని... ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వని... నిండు శాసనసభలో ఆడబిడ్డలను అగౌరపరిచిన.... రైతులకు సాగు, ప్రజలకు తాగు నీరు అందించలేని వైసీపీ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడిపోతోందని జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. ప్రకృతి వనరులైన ఇసుక, మట్టి, గనులను ఇష్టానుసారం దోచుకున్నారని, గతంలో రూ.1800 ఉన్న ఇసుకను రూ.5 వేలుకు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అందిస్తామని, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల్లా పరిగెట్టిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం గన్నవరం నియోజకవర్గం హనుమాన్ జంక్షన్ లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "ఇంకా ఎన్నికలకు నాలుగు రోజులే సమయం ఉంది. మన భవిష్యత్తును దిశానిర్దేశం చేసే ఎన్నికలు ఇవి. ప్రతి ఒక్కరూ ఎంతో జాగ్రత్తగా ఆలోచించి ఓటు వేయాలి. కూటమి తరఫున గన్నవరం నుంచి పోటీ చేస్తున్న శ్రీ యార్లగడ్డ వెంకట్రావు, నూజివీడు నుంచి పోటీ చేస్తున్న శ్రీ కొలుసు పార్థసారథి, మచిలీటప్నం ఎంపీగా పోటీ చేస్తున్న శ్రీ వల్లభనేని బాలశౌరి వీళ్లంతా వైసీపీ నుంచి బయటకు వచ్చిన వారు. వైసీపీలో దాస్యం చేయలేక, ఆత్మ గౌరవాన్ని తాకట్టు పెట్టలేక బయటకు వచ్చి కూటమి తరఫున బరిలో నిలబడ్డారు. వారిని గెలిపించే బాధ్యత మనదే.

* వంశీకి ఓటు వేస్తే... ఆడబిడ్డలను అగౌరవపరిచినట్లే

2014లో తెలుగుదేశం, భారతీయ జనతా పార్టీలకు మద్దతుగా నిలబడ్డాను. ఆ సమయంలో వల్లభనేని వంశీకి మద్దతుగా ప్రచారం చేశాను. ఆ సమయంలో ఆయన నాతో ఒక మాట చెప్పాడు. మీరు చెప్పడం వల్లే ఎప్పుడు నాకు ఓటు వేయని కొన్ని ప్రాంతాల్లో ఓట్లు పడ్డాయని చెప్పారు. ఆయన వివేకం ఉన్న నాయకుడు, ప్రజలకు మంచి చేస్తాడని భావించి ఆ రోజు అండగా నిలబడ్డాను. కానీ ఆయన ఓట్లు వేసిన ప్రజలను మోసం చేసి వైసీపీలో చేరాడు. రాజకీయాల్లో విభేదాలు సహజం. పాలసీలపరంగా అభిప్రాయభేదాలు ఉండొచ్చు. నేను కూడా చంద్రబాబు గారితో పాలసీలపరంగా విభేదించాను. అంతే తప్ప వ్యక్తిగత దూషణలకు ఏనాడు పాల్పడలేదు. ఇంట్లో ఆడవాళ్లను అగౌరవపరిచేలా మాట్లాడలేదు. వంశీ మాత్రం శ్రీ ఎన్టీఆర్ గారి కుమార్తె, శ్రీ చంద్రబాబు గారి సతీమణి శ్రీమతి భువనేశ్వరి గారిని తూలనాడటం బాధనిపించింది. జగన్ తో నాకు, చంద్రబాబు గారికి రాజకీయంగా విభేదాలు ఉండొచ్చు. ఏనాడు కూడా మేము శ్రీమతి భారతీ గారిని ఒక్క మాట అనలేదు. జనసేన మద్దతుదారులకు ఒకటే విన్నవిస్తున్నాను... వంశీకి ఓటు వేస్తే ఆడబిడ్డలను అగౌరపరిచే వ్యక్తికి మద్దతు తెలిపినట్లే. ఆడబిడ్డలను అగౌరపరిచే నైజం ఉన్నవాళ్లు గెలిస్తే... రేపు మన ఇంట్లో ఆడబిడ్డలను కూడా ఇలానే దూషిస్తారు. ఎమ్మెల్యే ఓటు నాకు వేసి ఎంపీ ఓటు ఎవరికైనా వేసుకోండి అని వంశీ ఓటర్లకు చెబుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఆయన ప్రలోభాలకు, ఆయన ఇచ్చిన రూ.2 వేలకు మనం లొంగిపోతే మన భవిష్యత్తును మనం నాశనం చేసుకున్నట్లే. ఈ ఎన్నికల్లో సరైన వ్యక్తిని ఎన్నుకోవడం చాలా అవసరం. వంశీలా యార్లగడ్డ వెంకట్రావు గారికి బూతులు తిట్టడం రాదు. సంస్కారం ఉన్న వ్యక్తి. రాజకీయాలను రాజకీయాలుగానే చూస్తాడు తప్ప బూతులు తిడుతూ నీచంగా మాట్లాడడు. గత ఎన్నికల్లో కేవలం అతి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయాడు. అయినా ఎక్కడికి పారిపోలేదు. ఓట్లు వేసిన ప్రజల కోసం నిలబడే ఉన్నాడు. ఇలాంటి వ్యక్తిని ఎన్నుకుంటే మన భవిష్యత్తు బాగుంటుంది.

* పోలవరం కుడి కెనాల్ ను ఏలూరు కెనాల్ తో అనుసంధానం చేస్తాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బందరుపోర్టును సకాలంలో పూర్తి చేస్తాం. గన్నవరం ఎయిర్ పోర్టు కోసం భూములు కోల్పోయిన నిర్వాసితులకు న్యాయం చేస్తాం. మచిలీపట్నం-కల్లూరు బైపాస్ రోడ్డును నిర్మిస్తాం. బ్రహ్మలింగయ్య చెరువును రిజర్వాయర్ గా అభివృద్ధి చేసి రూ. 12 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తాం. మల్లవల్లి రైతులకు అండగా ఉండటంతో పాటు... మల్లవల్లి ఎస్ఈజెడ్ లో పూర్తిస్థాయిలో పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తాం. ఇండస్ట్రియల్ పార్క్ ఏ ఉద్దేశంతో ఏర్పడిందో.. దానిని నెరవేరుస్తాం. నియోజకవర్గంలో రెండు అండర్ పాస్ లు కావాలని ప్రజలు కోరుకుంటున్నారు.. వాటి నిర్మాణానికి బాధ్యత తీసుకుంటాం. చింతలపూడి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. పామాయిల్ పంటకు రాయితీలు కల్పిస్తాం. రామవరప్పాడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. కేసరపల్లి బ్రిడ్జ్ నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. పోలవరం కుడి కెనాల్ ను ఏలూరు కెనాల్ తో అనుసంధానం చేసి సాగు, తాగు నీటి కష్టాలు తీరుస్తాం.

* మద్యం, గంజాయి అమ్మేవాడు ఉద్యోగాలు ఇస్తాడా..?

మాట్లాడితే క్లాస్ వార్ ... క్లాస్ వార్ అని కథలు చెప్పే జగన్... అధికారంలోకి రాగానే ఒక్క మద్యం అమ్మకాల్లోనే రూ.41 వేల కోట్లు దోచేశాడు. ఇసుకలో మరో రూ. 40 వేల కోట్లు దోచుకున్నాడు. రూ. 450 కోట్ల భవననిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని పక్కదారి పట్టించాడు. మద్యం, గంజాయి అమ్మే ఇలాంటి వ్యక్తి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించగలడా..? బాధ్యతగా ఉండే వాడు అయితేనే యువతకు న్యాయం చేయగలడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీపై పెడతాం. పోలీస్ వ్యవస్థలో ఖాళీలను భర్తీ చేస్తాం. సీపీఎస్ కు ఏడాదిలోగా పరిష్కారం చూపిస్తాం. భవన నిర్మాణ కార్మికులతో పాటు ముఠా కూలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం. తాత్కాలికమైన ప్రలోభాలకు, వైసీపీ ఇచ్చే డబ్బులకు ఆశపడి ఓటు వేస్తే మన భవిష్యత్తను మనమే నాశనం చేసుకున్నట్లే. ఈ ఎన్నికల్లో ధర్మందే విజయం.. పొత్తుదే గెలుపు... కూటమిదే పీఠం.

* వైసీపీకి ఓటు వేస్తే మన ధర్మాన్ని మనమే అవమానించినట్లు

విజయవాడ కనకదుర్గమ్మ రథానికి ఉండే వెండి సింహాలు మాయమైతే... వైసీపీ నాయకులు ఏం మాట్లాడారో ఒక్కసారి గుర్తు తెచ్చుకోండి. ఆ వెండి సింహాలతో మేడలు, మిద్దెలు కట్టుకుంటారా అని హేళనగా మాట్లాడారు. కాల్ మనీ కేసులో పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగిన వ్యక్తికి దుర్గ గుడి ఛైర్మన్ పదవి ఇచ్చారు. నకిలీ దర్శనం టికెట్లు ముద్రించి డబ్బులు దోచేశారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో దాదాపు 200 పైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. దేవతామూర్తుల విగ్రహాలను అపవిత్రం చేశారు. ఒక్కరంటే ఒక్కరిని కూడా వైసీపీ ప్రభుత్వం పట్టుకోలేదు. ఒక్క హిందూ మతాన్నే కాదు అన్ని మతాలను చిన్నచూపు చూశారు. మసీదుల అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వలేదు. వైసీపీ కి మరోసారి ఓటు వేస్తే మన సనాతన ధర్మానికి తూట్లు పొడిచినట్లే.

* కూటమి నాయకులను నిండు మనసుతో ఆశీర్వదించండి

ఏ స్థాయికి అయినా వైసీపీ నాయకులు దిగజారిపోతారు. యుద్ధం కూడా కొన్ని నియమాలతో చేస్తారు. రాష్ట్ర రాజకీయాల్లో నియమాలు లేవు. దిగజారిపోయాయి. జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నాడు.. అందరూ ఒక్కటై నన్ను ఓడించాలని చూస్తున్నారని ప్రజల మధ్య సింపతి నాటకాలు ఆడుతున్నాడు. ప్రతిపక్షాలు ఉన్నది జగన్ ను గెలిపించడానికా..? మేము గెలవడానికా..? ఇంత చిన్న లాజిక్ మరిచిపోయి డ్రామాలు ఆడుతున్నాడు. అధికారం ఉంది కదా అని వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకొని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కడినైనా నామినేషన్ వేయనిచ్చావా..? ఇప్పుడు ఎలక్షన్ కమిషన్ అధికారులను మారుస్తుంటే ప్రతిపక్షాలపై పడి ఏడుస్తున్నాడు. అభివృద్ధి, సంక్షేమం పక్క పక్కన ఉండాలి. డబ్బులు లేకపోతే సంక్షేమం చేయలేం. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని సమపాళ్లలో పరుగులు పెట్టిస్తాం. యువత ఒక్కటే తేల్చుకోవాలి. మార్పు కోసం ముందుకు వెళ్లకపోతే రౌడీయిజం చేసే నాయకులకు భయపడి బతకాలి. మీ కోసం నిలబడే నాయకుల సమూహం అండగా ఉంది. ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు అనే ఆయుధంతో వైసీపీ అవినీతి కోటలు బద్దలు కొట్టండి. కూటమి తరఫున మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా శ్రీ వల్లభనేని బాలశౌరి, గన్నవరం నియోజకవర్గం నుంచి శ్రీ యార్లగడ్డ వెంకట్రావు, నూజివీడు నుంచి శ్రీ కొలుసు పార్థసారథి, పెనమలూరు నుంచి శ్రీ బోడే ప్రసాద్, దెందులూరు నుంచి శ్రీ చింతమనేని ప్రభాకర్ పోటీ చేస్తున్నారు. వారిని అఖండ మెజార్టీతో గెలిపించాల"ని ప్రజలను కోరారు.



# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

SRI TV

గురువారం, 09 మే 2024









# వైసీపీకి కౌంట్ డౌన్ స్టార్ట్

* అవినీతిలో మునిగి, రౌడీయిజాన్ని పెంచి పోషించిన వైసీపీని ఇంటికి పంపాలి
* వైసీపీ మాఫియాలకు ఎన్డీఏ ప్రభుత్వంలో తగిన ట్రీట్మెంట్ ఉంటుంది
* మోదీ లక్ష్యం – ఆంధ్ర ప్రదేశ్ వికాసం
* దేశాన్ని ముక్కలు చేయాలనేదే కాంగ్రెస్ ఆలోచన
* రాయలసీమకు సాగునీరు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటాం
* కేంద్రం, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ అవసరం ఉంది
* కలికిరి ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచార సభలో ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ

శతఘ్ని న్యూస్: 'పేదల కోసం రాష్ట్ర భవిష్యత్తు కోసం పని చేయాల్సిన వైసీపీ ప్రభుత్వం మాఫియాను పెంచి పోషించింది. వైసీపీ పాలనలో రాష్ట్రంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగింది. వీరి ఇసుక దాహానికి ఏకంగా అన్నమయ్య సాగునీటి డ్యాము తెగిపోయింది. ఏకంగా కొన్ని గ్రామాలు మునిగిపోయి, 39 మంది మృతికి కారణమయ్యారని తెలుసుకొని వేదన చెందాను. ఇలాంటి ఇసుక మాఫియా, ప్రశ్నించే వారిపై దాడులు, రౌడీ రాజ్యం ఆంధ్రప్రదేశ్లో తీసుకువచ్చిన వైసీపీకి కౌంట్ డౌన్ మొదలైంది. ఇక వారు రోజులు లెక్క పెట్టుకోవాల్సిందేన'ని దేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో మంత్రులు గూండా గిరి చేస్తారు.. ఎమ్మెల్యేలు ఇసుక దోచుకుంటారు. పూర్తిగా అవినీతిలో మునిగిపోయిన వైసీపీ పాలన నుంచి ఆంధ్రప్రదేశ్ ను కాపాడుకోవాలి.. రాష్ట్రంలో ఎన్డీఏ డబుల్ ఇంజన్ సర్కారు రావాలి అని చెప్పారు. ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచార సభ బుధవారం పీలేరు నియోజకవర్గం, కలికిరిలో జరిగింది. ఈ వేదిక నుంచి శ్రీ నరేంద్ర మోడీ గారు మాట్లాడుతూ... "ఎంతో నమ్మకంతో ప్రజలంతా 2019లో వైసీపీని గెలిపిస్తే వారి నమ్మకాన్ని వైసీపీ తుంగలో తొక్కింది. ప్రజల పట్ల విశ్వాస ఘాతుకంగా పని చేసింది. పూర్తి అవినీతిలో కూరుకుపోయి, ఆంధ్ర ప్రదేశ్ ను రౌడీ రాజ్యంగా మార్చింది. ఈ వైసీపీ మాఫియాలకు ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో తగిన ట్రీట్మెంట్ ఇస్తాం. ప్రతి ఒక్క అవినీతిని బయటకు తీస్తాం. ప్రతి ఒక్కరికి తాగునీరు ఇవ్వాలని కేంద్రం తీసుకువచ్చిన జలజీవన్ మిషన్ పథకాన్ని వైసీపీ పట్టించుకున్నది లేదు. పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నాశనం చేశారు. వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు ముందుకు సాగలేదు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ఎన్డీఏ సర్కారు వస్తే రాయలసీమ పెండింగ్ సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. పోలవరాన్ని పూర్తిస్థాయిలో నిర్మించే బాధ్యతను తీసుకుంటాం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి దిశగా ముందుకు నడుపుతాం.

*** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలమైన డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి**

ఏ ప్రాంతమైనా ఏ రాష్ట్రమైనా, దేశమైనా అభివృద్ధి చెందాలి అంటే సుస్థిరమైన ప్రభుత్వం, బలమైన నాయకత్వం అవసరం. రాయలసీమకు బలమైన అభివృద్ధి అవకాశాలు ఉన్నాయి. రాయలసీమలో అపారమైన ఖనిజ సంపద, ఆలయాలు, బలంగా పనిచేసే యువత, కష్టించి సాగు చేసే రైతులు, పర్యాటక రంగం నిండుగా ఉండే ప్రాంతం. ఈ ప్రాంతాన్ని సరైన రీతిలో అభివృద్ధి చేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఆ బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. రాష్ట్రంలో, దేశంలో ఒకే రకమైన నాయకత్వం ఉంటే పరస్పర సహకారం చాలా చక్కగా ఉంటుంది. రాయలసీమపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధిలో అందనంత ఎత్తుకు తీసుకువెళ్లే బాధ్యత ఎన్డీఏ సర్కార్ తీసుకుంటుంది. ఉపాధి పరిశ్రమలు తీసుకొచ్చి వలసలు నిరోధించేలా పనిచేస్తాం. మోడీ లక్ష్యం ఆంధ్ర ప్రదేశ్ వికాసం. దాన్ని కచ్చితంగా నెరవేర్చుదాం. గత ఐదేళ్లలో కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ ప్రాభవాన్ని తిరిగి నెలకొల్పుతాం.

*** కాంగ్రెస్ ఆలోచనలన్నీ రివర్స్ గేర్లో ఉంటాయి**

దేశంలో గత పదేళ్లలో తీసుకొచ్చిన ఎన్నో మంచి కార్యక్రమాలను కాంగ్రెస్ రద్దు చేస్తానని చెబుతోంది. కాంగ్రెస్ ఆలోచనలన్నీ రివర్స్ పాలన మాదిరిగా ఉంటాయి. కాంగ్రెస్ మళ్లీ విజయం సాధిస్తే ఆర్టికల్ 370ని తీసుకొస్తామని చెబుతోంది. సీఏఏ రద్దు చేస్తామని అంటోంది. పేదలకు ఇచ్చే బియ్యం నిలుపుదల చేస్తామని చెబుతోంది. పేదల జీవితాలకు ఆరోగ్య భద్రతను తీసేస్తామని చెబుతోంది. చివరకు సుప్రీంకోర్టు తీర్పుతో నిర్మాణం అయిన రామ మందిరానికి కూడా తాళాలు వేస్తామని చెబుతోంది. కాంగ్రెస్ నేతల ఆలోచనలు అన్ని రివర్స్ లోనే ఉంటాయి. దేశానికి బలమైన నాయకత్వం ఉంటే దేశం తలెత్తుకుని ఉంటుంది. అరబ్ దేశాలతో ఎన్నడూ లేనట్లుగా భారత్ సంబంధాలు మెరుగయ్యాయి. ఖతార్లో చిక్కుకున్న దేశ ప్రజలను సురక్షితంగా తీసుకురాగలిగాం. మోడీ జాతి నిర్మాణ బాధ్యతను తీసుకున్నాడు. సరికొత్త భారతదేశం, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాలని భావిస్తున్నాడు. ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయాలని ప్రతి వర్గాన్ని అత్యున్నతంగా నిలపాలని భావిస్తున్నాడు. మోడీకి ఈ సమయంలో మీరు అండగా నిలవాలి.

*** దేశాన్ని ముక్కలు చేయాలనేది కాంగ్రెస్ ఆలోచన**


అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఎన్ని దారులైన తొక్కుతుంది. ఇప్పుడు తాజాగా దక్షిణం, పశ్చిమం అంటూ దేశాన్ని విభజించే కుట్రను చేస్తోంది. దేశాన్ని ముక్కలు చేసి జాతి మూలాలు తొలగించాలని భావిస్తోంది. మనమంతా భారతజాతి కాదు వేర్వేరు జాతులు అని ప్రచారం చేస్తోంది. గాంధీ పరివారానికి అత్యంత సన్నిహితుడైన వ్యక్తి అమెరికా వేదికగా చేస్తున్న వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయి. తమిళ సంస్కృతి వేరని, ఉత్తరాది వేరంటూ చెబుతున్నారు. అమెరికాలో చర్మం రంగును బట్టి జాతులుగా విభజించినట్లు దేశాన్ని కూడా ముక్కలు ముక్కలు చేసి పరిపాలించాలని భావిస్తోంది. దీనికి బాలథాక్రె వంటి పెద్దల మూలాలు ఉన్న వ్యక్తులు సైతం మద్దతు పలకడం బాధిస్తోంది. కాంగ్రెస్ ఆలోచనలన్నీ దేశానికి చాలా ప్రమాదకరంగా ఉంటాయి. ఇలాంటి ఆలోచనలు ఉన్న పార్టీని ఆ నాయకుల్ని ప్రజలంతా తిప్పి కొట్టాలి. వారికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠాన్ని నేర్పాలి.

*** రాష్ట్ర అభివృద్ధికి మోడీ గ్యారంటీ ఉంటుంది**

భారతదేశాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తూ ముందుకు వెళ్తున్నాం. జాతీయ రహదారులు, రైల్వేలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశాం. దేశంలో సౌకర్యాలు మౌలిక వసతులు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సైతం మోడీ గ్యారెంటీ ఉంటుంది. నంద్యాల – ఎర్రగుంట్ల రైల్వే లైను అలాగే కడప బెంగళూరు రైల్వే లైను మంజూరు అయింది. దేశంలో పారిశ్రామిక కారిడార్లు వచ్చినట్లుగా రాష్ట్రంలో కూడా విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి చేస్తాం. దక్షిణ భారతదేశంలో కూడా బుల్లెట్ ట్రైన్ అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో కూడా బుల్లెట్ ట్రైన్ పరుగులు ఉంటాయి. రాయలసీమ రైతుల కరువు తీరుస్తాం. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతోపాటు ఇక్కడ ఉద్యాన పంటల రైతులకు తగిన ప్రోత్సాహం ఇస్తాం. అత్యంత ఆధునిక కోల్డ్ స్టోరేజీల నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఈ ప్రాంతానికి తీసుకొస్తాం. ఇప్పటికే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ క్లస్టర్ ను మొదలు పెడుతున్నాం. అలాగే చిత్తూరు ప్రాంత రైతులకు టమాటా ప్రాసెసింగ్ యూనిట్ అవసరం ఉంది. దీన్ని ఈ ప్రాంతంలో వచ్చేలా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు చూపించడం, యువ శక్తిని చక్కగా వినియోగించుకోవడంలో ఎన్డీఏ సర్కారు దృష్టి పెడుతుంది. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులను అలాగే రాజంపేట బీజేపీ అభ్యర్థి శ్రీ నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డాక్టర్ వరప్రసాద్, కడప పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి శ్రీ భూపేష్ రెడ్డి, చిత్తూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి శ్రీ దగ్గుమల్ల ప్రసాదరావులను మంచి మెజారిటీతో ఢిల్లీ పంపిస్తారని కోరుకుంటున్నాను" అన్నారు.



SRI TV
# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 09 మే 2024




## సత్తెనపల్లి రూరల్ మండలంలో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



శతఘ్ని న్యూస్: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి రూరల్ మండలం, కందులవారి పాలెం మరియు గోగులపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ మరియు జనసేన పార్టీ బొర్రా వెంకట అప్పారావు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తప్పెట్లతో స్వాగతం పలికిన గ్రామస్తులు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచి ఎన్నికల మేనిఫెస్టో గురించి తెలియజేసి సైకిల్ గుర్తుకు ఓటు వేసి కన్నా లక్ష్మి నారాయణ గారిని గెలిపించాలని బొర్రా వెంకట అప్పారావు గారు ఓటు ను అభ్యర్థించారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై మీ అమూల్యమైన ఓటు వేసి శాసనసభ్యుడిగా కన్నా లక్ష్మి నారాయణ గారిని పార్లమెంటు సభ్యుడిగా శ్రీకృష్ణదేవరాయల గారిని అఖండ మెజారిటీ తోటి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా నియోజకవర్గ, మండల గ్రామ నాయకులు జనసేన నాయకులు బిజెపి నాయకులు కార్యకర్తలు మహిళా నాయకురాల్లు పాల్గొన్నారు.

## బృగుబండ గ్రామంలో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



శతఘ్ని న్యూస్: సత్తెనపల్లి రూరల్ మండలం, బృగుబండ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రివర్యులు కన్నా లక్ష్మీనారాయణ మరియు శ్రీమతి మేఘన శ్రీకృష్ణదేవరాయలు, జనసేన పార్టీ నాయకులు బొర్రా వెంకట అప్పారావు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామస్తులు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తప్పెట్లతో స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంచి ఎన్నికల మేనిఫెస్టో గురించి తెలియజేసి తెలుగుదేశం పార్టీ సైకిల్ గుర్తుకు ఓటెయ్యాలని కన్నా మరియు జనసేన పార్టీ నాయకులు బొర్రా అప్పారావు అభ్యర్థించారు.

## బుక్కూరు గ్రామంలో ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



శతఘ్ని న్యూస్: పాలకొండ: బుక్కూరు గ్రామంలో బుధవారం ఎన్డీఏ కూటమి బలపరిచిన జనసేన అభ్యర్థి “నిమ్మక జయకృష్ణ” ని గెలిపించవలసిందిగా మహాకూటమి నేతలు ఓటర్ మహా మహాశయులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఉపాధ్యక్షులు “గర్భాన సత్తిబాబు”, టీడీపీ నాయకురాలు జయకృష్ణ గారి సోదరి శ్రీమతి నిమ్మక మాధురి, తెలుగుదేశం పార్టీ పాలకొండ మండల అధ్యక్షులు గండి రామినాయుడు, తెలుగుదేశం పార్టీ మహిళా నాయకురాలు శ్రీమతి యోగిత గారు, పాలకొండ జనసేన నాయకులు మిడితాన ప్రసాద్, పెనుగొండ రాజశేఖర్, డొంక శివ ప్రసాద్, దోంపాక శివ, మాధాసి సంతోష్, జామి రాంబాబు, వారాడ గజేంద్ర నాయుడు. వీరఘట్టం జనసేన నాయకులు సతివాడ వెంకటరమణ, గర్భాపు నరేంద్ర మరియు, స్థానిక, జనసేన నాయకులు బిజెపి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొర్రా వెంకట అప్పారావుని కలిసిన లావు శ్రీకృష్ణదేవరాయలు



శతఘ్ని న్యూస్: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి దూళిపాళ్ళ జనసేన పార్టీ కార్యాలయంలో బొర్రా వెంకట అప్పారావుని మర్యాదపూర్వకంగా కలిసిన పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, సతీమణి శ్రీమతి మేఘన మరియు ఎలక్షన్ కోఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి యాదవ్.


## నాగబాబుకి స్వాగతం పలికిన డా. పసుపులేటి



శతఘ్ని న్యూస్: తిరుపతి: ప్రధానమంత్రి మోడీ సభకు విచ్చేసిన నాగబాబుకి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరి ప్రసాద్ స్వాగతం పలికారు.

## అవినీతి ప్రభుత్వాన్ని సాగనంపుతాం

శతఘ్ని న్యూస్: రాజంపేట: రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను అవినీతిమయంగా మార్చివేసి అవినీతి పాలనకు తానే రారాజు అంటూ, ఎదుగుతున్న వైయస్ జగన్ ను జరగబోయే ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించి రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తిరుపతి నియోజకవర్గ జనసేన పార్టీ ఎన్నికల పరిశీలకులు అతికారి కృష్ణ, జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్యలు అన్నారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామంలో బుధవారం కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ, కూటమి నేతలు అట్టహాసంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ, బ్యాలెట్ నమూనా ఓటర్లకు అవగాహన కల్పిస్తూ, ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి నియోజకవర్గ జనసేన పార్టీ పరిశీలకుడు అధికారి కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి నేతలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికి గజమాల వేసి శాలువాతో సత్కరించారు.




## కేశవదాసుపాలెంలో ఎన్డీఏ కూటమి ప్రచారం

శతఘ్ని న్యూస్: రాజోలు: కేశవదాసుపాలెం గ్రామంలో 10వ రోజు 2వ సారి బ్యాలట్ తో 23, 24,25,26,27 వ బూత్ లలో ఇంటిఇంటికి ప్రచారంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీలు బలపరిచిన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీదేవ వరప్రసాద్ మరియు అమలాపురం పార్లమెంటరీ ఎంపీ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన, టీడిపి, బీజేపీ గ్రామ ముఖ్య నాయకులు, జనసైనికులు ఇంటి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలు, బిసి డిక్లరేషన్ గురించి, ఎస్సీ ఎస్టీ సోదరులకు 19% ఉన్న రిజర్వేషన్ 12% అమలు చేస్తూ, 27 పథకాలు తొలగించిన మోసలను, కొత్త జీఓ ద్వార భూమి హక్కు మనకు లేకుండా చేసినా జగన్ రెడ్డి దిగిపోవాలి అని తెలియజేస్తూ త్రాగు నీరు, డ్రైనేజ్, కరెంటు రోడ్లు, సమస్యలు తెలుసుకుని. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ సమస్యలు తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ఉమ్మడి మేనుపెస్టూ వివరించి మన భవిష్యత్ బాగుండాలి అంటే ఎమ్మెల్యే అభ్యర్థికి గాజు గ్లాసు ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై తమ అమూల్య మైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరాము. ఈ ప్రచారంలో గ్రామంలోని జనసేన, టీడీపి, బీజేపీ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




## ఎన్డీఏ కూటమిని అధికారంలోకి తీసుకురావడానికే జనసేన నాయకుల పోరాటం



శతఘ్ని న్యూస్: అల్లూరి సీతారామరాజు జిల్లా, పాడేరు: అరకు పార్లమెంట్ ఇంచార్జ్ డా. వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు, పాడేరు నియోజకవర్గం పరిధిలోని, సంతబయలు, గుత్తూరుపుట్టు, గబ్బంగి, అనసపల్లి, నేరేడివలస, అనేక ప్రాంతాల్లో పర్యటించిన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు గడప గడపకు పర్యటించడం జరిగింది. రాష్ట్రాన్ని రావణ కాష్టం నుండి కాపాడాలని, అలాగే, ఈ నిరంకృష పాలనకు చరమగీతం పాడాలని, ఓటు అనే ఆయుధంతో ఈ వైసీపీ పార్టీనీ తరిమి తరిమి కొట్టాలని కోరారు.. అలాగే అరకు పార్లమెంట్, జనసేన, బీజేపీ, టీడీపీ, పార్టీలు బలపరిచిన శ్రీమతి కొత్తపల్లి గీత గారికి, మీ అమూల్య మైన అతి పవిత్రమైన ఓటు ముద్రను బ్యాలెట్లో 3వ నంబర్ గుర్తుపై వేసి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి శ్రీమతి గిడ్డి ఈశ్వరి గారికి, 2 వనంబర్ సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండమెజరిటీతో గెలిపించాలని అభ్యర్థించిన పాడేరు ఎన్డీఏ కూటమి నాయకులు, అలాగే ఉమ్మడి పార్టీల మేనిఫెస్టో వివరించడం జరిగింది...ప్రజలు ఘనస్వాగతం పలికి ఉమ్మడి అభ్యర్థులను గెలిపిస్తం అని తెలిపినందుకు ధన్యవాదాలు తెలిపిన ఉమ్మడి నాయకులు. ఈ ప్రచారంలో జనసేనపార్టీ కాకినాడ రూరల్ ఐటీ టీమ్ కో ఆర్డినేటర్ సీ.హెచ్. అనిల్ కుమార్ జనసేన, పాడేరు మండల నాయకులు ముదిలీ. సుబ్బారావు, టీడీపీ జిల్లా కన్వీనర్. కోడ. సురేష్, టీడీపీ సర్పంచ్ బాబు రావు పడాల్, టీడీపీ మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, బీజేపీ నాయకులు, టీడీపీ మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రి గ్రామంలో ఎన్డీఏ కూటమి విస్తృత ప్రచారం




శతఘ్ని న్యూస్: పాలకొండ నియోజకవర్గం, వీరఘట్టం మండలం చలివేంద్రి గ్రామంలో జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాలను శిరసా వహిస్తూ.. జనసేన జిల్లా కార్యదర్శి బి.పి.నాయుడు, సంయుక్త కార్యదర్శి జనసేన జానీ మరియు జనసేన క్రియాశీల వాలంటీర్ మత్స పుండరికం జనసేన, బిజెపి, తెలుగుదేశం పార్టీ నాయకులు చలివేంద్రి గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అరకు ఎంపీ అభ్యర్థి కొత్తపల్లి గీత, ఎమ్. ఎల్. ఏ అభ్యర్థి నిమ్మక జయకృష్ణ గెలిపించాలని ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గాజుగ్లాస్ గుర్తు కే మీ ఓటు, కమలం గుర్తుకే మీ ఓటు వేయాలని నినాదాలతో హోరెత్తించారు. కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చలివేంద్రి పంచాయతీకి సంబందించిన టీడీపీ, జనసేన గ్రామ పంచాయతి నాయుకులు, కార్యకర్తలు, సైనికులు వీరఘట్టం మండలం జనసేన, బీజేపీ నాయుకులు పాల్గొన్నారు.

## 17వ డివిజన్ గుల్జార్ పేట నందు ఎన్డీఏ కూటమి ఎన్నికల ప్రచారం



శతఘ్ని న్యూస్: అనంతపురం అర్బన్: జనసేన – టిడిపి– బిజెపి కూటమి ఉమ్మడి అనంతపురం అర్బన్ నియోజకవర్గపు ఎమ్మెల్యే అభ్యర్థిగా దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ని మరియు అనంతపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నగర ప్రజలకు విజ్ఞప్తి చేయడం జరిగింది. ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి తమ్ముడితో కలిసి అనంతపురం జిల్లా జనసేన ఉపాధ్యక్షులు లాయర్ కుంటిమద్ది జయరాం రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైద్య ఖర్చులు నిమిత్తం ఆర్థిక సాయం



శతఘ్ని న్యూస్: కోనసీమ జిల్లా, ఐ. పోలవరం కు చెందిన చీకురుమెల్లి నాగేంద్ర బాబు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన అమలాపురం 9వార్డ్ జనసేన కౌన్సిలరు గోల కోటి విజయలక్ష్మి –వాసు దంపతులు స్నేహితుల నుండి సేకరించిన రూ 10వేలు నాగేంద్ర బాబు తల్లి ఏడు కొండలకు అందచేశారు. ఆర్థిక సహాయం చేసిన వారిలో జనసేన కౌన్సిలర్ 7వార్డ్ గండి హారిక, కొమ్ముల శివ, వేణు పళ్ళ చోళ్ళ, కడలి గణేష్, కొమ్ముల రత్న కుమార్, మోటూరి సాయిదేవి, అడపా దుర్గేష్, నల్లా భవాణి, ఎల్. పిన్నిధి, బొంతు శ్రీను, కొమ్ముల మణికంఠ, మోటూరి రాజ్య లక్ష్మి, సుందరానిది జీవధార, విజయ్, సుందరనిది లక్ష్మణ్ లు వున్నారు. మెండ శ్రీ కాంత్ ఒక నెలకు సరిపడే నిత్యవసర వస్తువులు నాగేంద్ర బాబు కుటుంబానికి అందచేశారు.

## ఎన్డీఏ కూటమిని గెలిపించండి: ఇమ్మడి కాశీనాథ్

శతఘ్ని న్యూస్: ప్రకాశం జిల్లా, మార్కాపురం పట్టణం సౌజన్య ఫంక్షన్ హాల్ నందు మార్కాపురం నియోజకవర్గ ముస్లిం మైనారిటీ ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్ తెలుగుదేశం, జనసేన మరియు బిజెపి పార్టీల మార్కాపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి గారిని మరియు ఒంగోలు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి గారిని గెలిపించుకోవాలని ముస్లిం మైనారిటీ సోదరులను కోరారు .




## 32 వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచార ర్యాలీకి భారీ స్పందన



శతఘ్ని న్యూస్: విశాఖ దక్షిణ నియోజకవర్గం 32వ వార్డులో బిజెపి, టిడిపి, జనసేన కూటమి అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచార ర్యాలీ బుధవారం ఘనంగా జరిగింది. జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డులో భీమ్ నగర్, పూతి వారి వీధి, అమ్మవారి వీధి, అల్లిపురం, సౌత్ జైల్ రోడ్డు తదితర ప్రాంతాలలో ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ జనసేన నాయకులు, దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచార ర్యాలీకి వందలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని చెప్పారు. ప్రతి చోట ఘన స్వాగతం లభించిందని తెలిపారు. జనసేన, బిజెపి, టిడిపి బలపరిచిన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. గత ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హయాంలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో అధికార మార్పు జరుగుతుందని పేర్కొన్నారు. మెజార్టీ సీట్లు కూటమి అభ్యర్థులు గెలుచుకుంటారని చెప్పారు. అలాగే దక్షిణ నియోజకవర్గంలో కూడా వంశీకృష్ణ శ్రీనివాస్ మెజార్టీ ఓట్లతో గెలుపొందడం ఖాయమని వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న కూటమి అధికారంలోకి తప్పకుండా రావాలని ప్రజలు ఈ దిశగా ఆలోచించాలని చెప్పారు. అయితే ప్రజలలో కూడా మార్పు వచ్చిందని ఎవరికి ఓటు వేయాలనేది ఎప్పుడో నిర్ణయం తీసుకున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో మాత్రం కూటమి అభ్యర్థులందరూ గెలవడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుల రాజశేఖర్, కేదార్నాథ్, బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




## ప్రజల పట్ల నిబద్ధత లేదు ఓట్ల కోసమే రాజకీయం



శతఘ్ని న్యూస్: తాడేపల్లిగూడెం: జగన్మోహన్ రెడ్డికి ప్రజల పట్ల నిబద్ధత లేదని, ఓట్ల కోసం రాజకీయం చేయాలని తపన తప్ప ప్రజాసేవకు అర్ధం తెలియదని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం దర్శిపర్రు, వల్లూరుపల్లి, రాచర్ల గ్రామాల్లో బుధవారం సాయంత్రం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి, నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ అందించాలనే తపన ఉన్న నాయకులు ఎన్నికల కోడ్ కంటే ముందే తాము ప్రజలకు ఇస్తానన్న సొమ్ము వారికి అందించి అప్పుడు ఎన్నికలకు సిద్ధం అంటూ తిరగాలని కానీ శవరాజకీయాలు చేసే జగన్ ఎన్నికల సమయంలో ప్రజలకు నిధులు ఇస్తామంటే ఎన్నికల నిబంధనలు ఒప్పుకోవు అని ముందుగానే తెలిసి ఆ పాపాన్ని ప్రతిపక్షాల మీద వేయచ్చనే దురాలోచనతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తాడేపల్లిగూడెంకి వచ్చి జగన్ తన శవరాజకీయాలను, కొట్రలను, కుతంత్రాలను, ఫ్యాక్షన్ రాజకీయాలు చెబితే చప్పట్లు కొడతారు తప్ప మరేం చెప్పినా తాడేపల్లిగూడెం ప్రజలు నమ్మరన్నారు. నియోజవర్గ వైసీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ నైతిక విలువలు కూడా మరిచి పోటీలో కుతంత్రాలకు పాల్పడుతున్నారన్నారు. తన పేరుతో ఉన్న అభ్యర్థితో నామినేషన్ వేయించడంతోపాటు ఆ వ్యక్తి కోసం ఆటోలు పెట్టి ఆ శ్రీనివాసరావు ఫోటో లేకుండా గుర్తును ప్రచారం చేసి కూటమి ఓటర్లను, ప్రజలను గందరగోళానికి గురి చేసేందుకు చూస్తున్నారని తాడేపల్లిగూడెం నియోజవర్గ ఓటర్లు ఎంతో నేర్పుగా ఆ కుతంత్రాల కొట్టుకు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల నాయకులు ప్రజాప్రతినిధులు ప్రజలు పూలతో హారతులతో ఘన స్వాగతం పలికారు. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు భారీగా హాజరయ్యారు.

## నాయకర్ సమక్షంలో వైసీపీ నుండి జనసేన పార్టీలో చేరికలు



శతఘ్ని న్యూస్: జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ గారి ఆశయాలు నచ్చి నరసాపురం నియోజకవర్గ వైసీపీ సీనియర్ నాయకులు రౌతుల శ్రీనివాస్ (ఆర్ ఎస్) మరియు వారి అనుచరులు టీడీపీ, బీజేపీ పార్టీలు బలపరిచిన నరసాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మిడి నాయకర్ సమక్షంలో వైసీపీ నుండి జనసేన పార్టీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి నాయకర్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వర్దనపు ప్రసాద్, మళ్లీపూడి వెంకటేశ్వరరావు మరియు నియోజకవర్గ జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

## భయపెట్టడమే రాజకీయం అనుకుంటే- ప్రజలు మీకు రాజకీయ సమాధి కడతారు

శతఘ్ని న్యూస్: నెల్లూరు: భయపెట్టడం, బెదిరించడమే రాజకీయం అనుకునే వైసీపీ నాయకులకు ప్రజలు రాజకీయ సమాధి కడతారని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు అన్నారు. చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామంలో బుధవారం ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోరుతూ జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయం ఖరారు కావడంతో వైసిపి నాయకులు చేస్తున్న ఉడత బెదిరింపులకు జనసైనికులు ఎవరు భయపడరన్నారు. వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో వైసిపి నాయకులు భయపెట్టేందుకు బెదిరిస్తే, భయపడేందుకు వారేమీ వైసిపి పేటిఎంబ్యాచ్ కాదని పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో నిండిన జనసైనికులు అన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సౌలభ్యంతో నచ్చిన పార్టీ జెండాను చేతబట్టి ప్రచారం చేసుకోవడంతో పాటు, నచ్చిన పార్టీకి ఓట్లు వేసుకొనే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, గ్రామాల్లో వైసిపి నాయకులు రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేయాలని చూస్తే, చూస్తూ ఊరుకోబోమన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఈసీ నిబంధాలను అనుసరిస్తూ ప్రచారం చేసుకోవడంతో పాటుగా ఓటు హక్కుని వినియోగించుకోవాలని కోరారు. టిడిపి సీనియర్ నాయకులు యదనపర్తి రాజా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ రావడం ఖాయమని, తిరుపతి ఎంపీగా ఉమ్మడి అభ్యర్థి వెలపల్లి వరప్రసాద్ రావు కు కమలం గుర్తు పై, ఎంఎల్ఏ పాశం సునీల్ కుమార్ కు సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు మండల తెలుగు యువత అధ్యక్షులు దొద్దగా వెంకట రమణ,వెంకటేశ్వర్లు, బీజేపీ శరత్ చంద్ర రెడ్డి, రమణయ్య, జనసేన నాయకులు క్రాంతి, బాలు, శివ, అక్బర్, వేణు, వంశి, రాము, శేఖర్, జోనేష్, శ్రీను, ఇలియాజ్, సాయి, దినేష్, వంశీ, ముత్తు, శ్రీను, సురేష్, చందు, సూర్య పాల్గొన్నారు.



## ఎన్డీఏ కూటమిని గెలిపించండి: కొట్టె మల్లికార్జున





శతఘ్ని న్యూస్: రాజమండ్రి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టిడిపి బిజెపి జనసేన పార్టీలు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్ కోసం, ప్రజల శ్రేయస్సు కోసం పొత్తు పెట్టుకున్న విషయం అందరికి తెలిసిందే. డోన్ అసెంబ్లీ బిజెపి యువ నాయకులు కొట్టె మల్లికార్జున మీడియాతో మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ రాజమండ్రి పర్యటన నిమిత్తం ఏపీ బిజెపి అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి అమ్మను వారి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. అనంతరం బిజెపి టిడిపి జనసేన నాయకులతో కలిసి కొరిమామిడి, తాడేమల్లి మరియు నిడదవోలు మండలంలో ప్రచారంను రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి , నిడదవోలు అసెంబ్లీ నుండి పోటీ చేస్తున్న కందుల దుర్గేష్ తరుపున ప్రచారం చేయడం జరిగింది. మే 13 న జరుగనున్న ఎన్నికల పోలింగ్ తేదిన ప్రజలు అందరూ రాజమండ్రి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరిని, నిడదవోలు అసెంబ్లీ ఎంఎల్ఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కందుల దుర్గేష్ ను గెలిపించాల్సిందిగా ప్రజల్ని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో పోటీ చేస్తున్న టిడిపి బిజెపి జనసేన కూటమి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరుతూ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టిడిపి బిజెపి జనసేన త్రిముఖ కూటమే అని డోన్ అసెంబ్లీ బిజెపి యువ నాయకులు కొట్టె మల్లికార్జున మీడియాతో పేర్కొన్నారు. రాజమండ్రి పార్లమెంట్, నిడదవోలు అసెంబ్లీ ప్రచార కార్యక్రమంకు సహకరించిన స్థానిక కూటమి నాయకులకు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అభిమానులకు, కార్యకర్తలకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## కూటమి అభ్యర్థులను గెలిపించాలని జనసేన ప్రచారం



శతఘ్ని న్యూస్: నెల్లూరు: కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని మసీదు సెంటర్, గాంధీ బొమ్మ, బొడ్డుచౌక్ ప్రాంతాల్లో జనసైనికులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా నష్టపోయిందని, తిరిగి రాష్ట్రం అభివృద్ధి పథంలోకి రావాలంటే ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ బలపర్చిన తిరుపతి ఎంపీ అభ్యర్థి డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు గారికి కమలం గుర్తుపై, గూడూరు నియోజకవర్గ ఎంఎల్ఏ అభ్యర్థి డాక్టర్ పాశం సునీల్ కుమార్ గారికి సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు పఠాన్ ఇమ్రాన్, కార్యదర్శులు ఉప్పు సాయి కిరణ్, మట్టింపాటి సనత్ కళ్యాణ్, రాకేష్, ఓంకార్, సంయుక్త కార్యదర్శులు పెంచలయ్య, సుబ్రమణ్యం, షారుఖ్, వసంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

SRI TV
# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




## నెల్లూరు రూరల్ నుండి జనసేన పార్టీలోకి చేరికలు




శతఘ్ని న్యూస్: నెల్లూరు: 25వ డివిజన్ జనసేన నాయకులు కుడుముల సురేష్ ఆధ్వర్యంలో బుధవారం దాదాపుగా యువత జనసేన పార్టీలో చేరారు. వారిని జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ వారి కార్యాలయంలో పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యున్నత విలువలు గల రాజకీయ జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గారు అని తెలిపేందుకు ఐక్యరాజ్యసమితి ఆహ్వానం నిదర్శనం. ప్రజల సమస్యల గురించి సమగ్ర అవగాహన కలిగిన వారు. రాష్ట్ర అభివృద్ధి గురించి దేశ ప్రగతి గురించి ఆలోచించగలిగిన నాయకుడు పవన్ కళ్యాణ్ గారు. ఫలానా అగ్ర కులానికి బానిసత్వం చేస్తూ ఫలానాకులం లో చేరాలనుకునే స్వార్థపరులు ఒకవైపు అయితే.. ఫలానా వెనకబడిన తరగతుల కులాన్ని స్వీకరించి వారి అభివృద్ధికి తోడ్పడుతానని పవన్ కళ్యాణ్ గారు ఒకవైపు. ఐదు సంవత్సరాల కాలంలో ఓడిపోయిన 50 కోట్ల రూపాయలు ప్రజల సంక్షేమం కోసం పంచిన పవన్ కళ్యాణ్ గారు ఒక శక్తి. నైపుణ్యం ఘనన చేసి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి వ్యాపారవేత్తలుగా అభివృద్ధి పరిచేందుకు ఆలోచిస్తున్న పవన్ కళ్యాణ్ గారి నిర్ణయాన్ని అందరూ గౌరవించాలి. వ్యతిరేక ఓట్లు చీల నివ్వను అన్న నిర్ణయానికి కట్టుబడి దాన్ని విజయవంతం సాధించబోతున్నారు పవన్ కళ్యాణ్. రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలన ఎదురించాలని ఒక క్లిష్టమైన పొత్తుకు స్వీకారం చుట్టి భారీ మెజారిటీతో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించుకోబోతున్నాం. చాలా రోజుల నుంచి జనసేన పార్టీకి మద్దతుగా ఉన్న వీరు ఈ రోజు డివిజన్ స్థాయి నాయకుడిగా వ్యవహరిస్తున్న ఒకరిద్దరు పార్టీ మారడం వల్ల జనసేన కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పంచుకుంటామని ముందుకు రావడం అభినందనీయం. పొత్తుకు ప్రజలు మద్దతు ఉంది. ఈ రోజున ఉమ్మడి అభ్యర్థులు గెలుపుకై మేమంతా కలిసి పని చేస్తాం. వైయస్సార్సీపి వ్యతిరేక ఓట్లను ఏవి కూడా చీలవ్వకుండా భారీ మెజారిటీతో అభ్యర్థులను గెలిపించుకుంటాం. మంచి ప్రజాదరణ కలిగిన నాయకులను ఉమ్మడి అభ్యర్థులుగా ప్రకటించడం జరిగింది. నెల్లూరు రూరల్ పోటీ చేస్తున్న నెల్లూరు శ్రీధర్ రెడ్డి గారు, నెల్లూరు సిటీ నుంచి పొంగూరు నారాయణ గారు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు ఎక్కడ కూడా అవినీతి లేని నాయకులను గెలిపించాలి. ప్రజలందరూ కూడా ఓటు హక్కుగా మాత్రమే కాకుండా బాధ్యతగా కూడా వ్యవహరించి జరుగుతున్న అన్యాయాన్ని వ్యతిరేకించి ప్రజా ప్రభుత్వం ఏర్పరచాల్సిందిగా కోరుకుంటున్నాను.

## జనసేనకు యునైటెడ్ కింగ్డమ్ ఎన్నారైల మద్దతు



శతఘ్ని న్యూస్: పెందుర్తి: ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వాన్ని మార్చుదాం.. రాష్ట్రాన్ని బాగు చేసుకుందాం అని యూకే జనసేన టీం సభ్యులు ప్రజలకు పిలుపునిచ్చారు. పెందుర్తిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ప్రవాస భారతీయులు పంచకర్ల రంగనాథ్, సిద్ధం శంకర్, చంద్ర సిద్ధం, అచ్యుత రాజు కుర్మాపు తదితరులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ నష్టపరిచిందని, దీన్ని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమిని గెలిపించేందుకు ప్రవాస భారతీయులందరూ కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా యూకే, కెనడాల నుండి 200 మంది జనసేన టీం రాష్ట్రానికి వచ్చామని, జనసేన పోటీ చేస్తున్న 21 నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో పెందుర్తి నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న పంచకర్ల రమేష్ బాబు గెలుపు కోసం పనిచేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలందరూ విజ్ఞతతో ఆలోచించి ఎన్డీఏ కూటమిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యువతకు ఉపాధి, రైతులకు భరోసా పారిశ్రామికరణ పెట్టుబడులు సమీకరణ తో పాటు రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ఎన్డీఏ అధికారంలోకి రావాలని వారు ఆకాంక్షించారు. ఈ ఈవెంట్ కి యూ కే జనసేన టీం తరుపున నాగరాజు వడ్రాణం, అమల చలమలశెట్టి, శివ కుమార్ మేక, పద్మజ రామిశెట్టి, నాగేంద్ర సోలంకల, శివ రామిశెట్టి, అశోక్ మాజేటి సపోర్ట్ గ ఉండటం జరిగింది. పెందుర్తి నియోగక వర్గం వాస్తవ్యులు అయిన అచ్యుత రాజు కుర్మాపు సహాయ సహకారానికి యూ కే – జనసేన టీం స్పెషల్ థాంక్స్ తెలపటం జరిగింది.

## పేదల సొంతింటి కల దూరం చేసిన జగన్



శతఘ్ని న్యూస్: చిలకలూరిపేట: పేదల పెన్నిధినని చెప్పుకొనే ముఖ్యమంత్రి జగన్ పట్టణ పేదల ఇళ్లపై పగబట్టారని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్, ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు పెంటేల బాలాజి చెప్పారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాలాజి మాట్లాడుతూ.. చంద్రబాబుపై కక్షతో ఆయన హయాంలో శ్రీకారం చుట్టిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకుండా పాడుపెట్టారని, గత ప్రభుత్వ హయాంలోనే దాదాపుగా పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను కూడా అసంపూర్తిగా వదిలేశారని మండి పడ్డారు. చంద్రబాబు మంజూరు చేశారన్న ఒకే ఒక్క కారణంతో పేదల ఆశలను అడియాసలు చేశారని ఆరోపించారు. పట్టణ పేదలకు పక్కా ఇళ్లు అందించాలన్న లక్ష్యంతో టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణా శ్రీకారం చుట్టిందని దాదాపు 6 లక్షల ఇళ్ల నిర్మాణపు పనులు చేపట్టిందని తెలిపారు. గత ఎన్నికల సమయానికి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే దాదాపు 2.70 లక్షల ఇళ్ల నిర్మాణం దాదాపుగా పూర్తయిందని గుర్తు చేశారు. పూర్తి అయిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడానికి సైతం జగన్ అంగీకరించలేదన్నారు. జగన్ సర్కారు వచ్చాక టిడ్కో ఇళ్లకు గ్రహణం పట్టిందని. ఎక్కడి నిర్మాణాలను అక్కడ ఆపేసిందన్నారు. రాష్ట్రంలో 90 శాతం పనులు జరిగిన నిర్మాణాలను కూడా పూర్తి చేయకుండా గాలికి వదిలేయటంతో చాలా చోట్ల టిడ్కో ఇళ్ల సముదాయాలు ముళ్ల చెట్ల పొదలతో నిండిపోయాయని వెల్లడించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించలేదన్నారు. గృహ ప్రవేశాలు జరగకుండానే బ్యాంకుల నుంచి నోటీసులు చిలకలూరిపేటలో సైతం 52 ఎకరాల్లో నిర్మించిన గత ప్రభుత్వ హయంలో 95 శాతం పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించటానికి పెద్ద ప్రహసనం నడిచిందని గుర్తు చేశారు. చివరి రెండేళ్ల కాలంలో కొంతమందికి మాత్రమే ఇళ్లు కేటాయించారని, అక్కడ వసతులు కల్పించటంతోనూ నిర్లక్ష్యం వహించారని వివరించారు. వివిధ కారణాలతో లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదని, గృహ ప్రవేశాలు జరగకుండానే బకాయిలు చెల్లించాలని బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడ్కో గృహాల లబ్ధిదారులకు నివేశన గృహాలు కేటాయించకపోవడంతో వేలాది రూపాయాలు ఇంటి అద్దెలకు చెల్లించలేక, పేద మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తయిన ఇళ్లను కేటాయించకపోవడం, కేటాయించిన వారికి వసతులు కల్పించకపోవడంతో టిడ్కో గృహాల వద్ద నివాసం ఉండటానికి సైతం ప్రజలు సంకోచిస్తున్నారని వెల్లడించారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించకుండా పేదల సొంతింటి కల దూరం చేసిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

## కొట్టు నైతికంగా ఓటమిని అంగీకరించినట్టే



శతఘ్ని న్యూస్: తాడేపల్లిగూడెం: నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి కొట్టు సత్యనారాయణ నైతికంగా ఓటమిని అంగీకరించినట్టేనని జనసేన యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. పెంటపాడు మండలం పెంటపాడు దర్శిపర్రు బిల్ల గుంట బోడపాడు గ్రామాల్లో బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి వలవల బాబ్జి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీలతో కలిసి తన తండ్రి బొలిశెట్టి శ్రీనివాస్ విజయం కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ తన తండ్రి బొలిశెట్టి శ్రీనివాస్ పేరు ఉన్న మరో బొలిశెట్టి శ్రీనివాసరావు బరిలోకి నిలిపి ఆ అభ్యర్థి ప్రచారాన్ని ఫోటో లేకుండా నెంబరు సింబల్ తో మాత్రమే ప్రచారం చేయించి కూటమి ఓటర్లను కన్ఫ్యూజ్ చేయడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. ఓటర్లు ఎంతో తెలివిగా ఓటు వేస్తారని వారిని మభ్య పెట్టాలనే ప్రయత్నాలు ఫలించవని స్పష్టం చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల బాబ్జి మాట్లాడుతూ రౌడీ మూకలను ఆట కట్టిస్తానన్న పొలిటికల్ రౌడీ కొట్టు మంగళవారం తన నిజస్వరూపాన్ని బయటపెట్టారని పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో కూటమి నాయకులను అరెస్టు చేయిస్తానని బెదిరించే ప్రయత్నం చేయడం దీనికి నిదర్శనం అన్నారు. ప్రజలంతా వైసీపీ కుట్రలు కుతంత్రాలను తెలుసుకొని వారిని తరిమికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారని మీరు జగన్ ని తీసుకొచ్చి ప్రచారం చేయించుకున్న, డమ్మీ అభ్యర్థులను నిలబెట్టి ప్రయత్నం చేసిన మీ పప్పులు తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఓటర్ల ముందు ఉడకవని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు భారీగా హాజరయ్యారు.

## కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న వైసీపీ




శతఘ్ని న్యూస్: గుంటూరు: ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు నరకయాతన అనుభవించారని, ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని కోల్పోయిన వైసీపీ ఓటమి అంచుల్లో కొనవూపిరితో కొట్టుమిట్టాడుతోందని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందే వైసీపీ నేతలు ఓటమిని అంగీకరిస్తున్నారన్నారు. ఇష్టం వచ్చిన రీతిలో అధికారులను మారుస్తున్నారని ఈ నేపధ్యంలో ఎన్నికలు సక్రమంగా జరుగుతాయన్న నమ్మకం తనకు లేదంటూ స్వయంగా ముఖ్యమంత్రి మాట్లాడటం ఓటమి భయాన్ని సూచిస్తుందన్నారు. జగన్ రెడ్డి బేలతనంతో పార్టీ శ్రేణుల్లో నిరాశానిస్పృహలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందే వైకాపా నేతలు కాడి వదిలేయటంతో కార్యకర్తలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ఇన్నాళ్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజల్ని, ప్రతిపక్ష నేతల్ని హింసించి పైశాచిక ఆనందం పొందారని విమర్శించారు. తమ అడుగులకు మడుగులొత్తుతూ తాము ఎన్ని దుర్మార్గాలు, దాష్టీకాలు చేసినా పట్టించుకోని అధికారుల్ని బదిలీ చేస్తే జగన్ రెడ్డి గుండెలు బాదుకోవటం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి జగన్ అరాచకాల్లో మొదటి బాధ్యులైన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ నుంచే వైకాపా పతనం ప్రారంభమైందంటూ జోస్యం చెప్పారు. తమకు న్యాయబద్ధంగా రావాల్సిన వాటిని కూడా రాకుండా చేయటమే కాకుండా విధి నిర్వహణలో నరకం చూపించిన జగన్ రెడ్డికి ఉద్యోగులు తమ ఓటుతో రాజకీయ ఘోరీ కడుతున్నారని వ్యాఖ్యానించారు. కొన్నేళ్లుగా ప్రజలు కోరుకుంటున్న వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాకారానికి సమయం ఆసన్నమైందని, రాష్ట్రానికి మంచిరోజులు రానున్నాయని ఆళ్ళ హరి అన్నారు.

SRI TV

# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024






























# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

SRI TV

గురువారం, 09 మే 2024





























SRI TV


# శతఘ్ని న్యూస్

జనగళమే మా గళం

గురువారం, 09 మే 2024




























# శతఘ్ని న్యూస్


జనగళమే మా గళం


గురువారం, 09 మే 2024





















SRI TV
# శతఘ్ని న్యూస్
జనగళమే మా గళం
గురువారం, 09 మే 2024

